తెలంగాణ లెజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా
తులసిరాజ్ గోకుల్ నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ లేజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా హైకోర్టు ప్రముఖ న్యాయవాది తులసిరాజ్ గోకుల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ఆయన బాధ్యతలను స్వీకరించారు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆయన నిజాం కాలేజీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. పడాల రామిరెడ్డి లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. 30 ఏండ్లుగా తెలుగు రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో ఆయన ప్రాక్టీస్ చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధమైన, శాసన వ్యవహారాల్లో ఆయన నిష్ణాతుడుగా గుర్తింపు పొందారు. లెజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్ బాధ్యతలు స్వీరించిన తర్వాత ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తులసి రాజ్ గోకుల్‌ను వారు అభినందించారు. అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు మాట్లాడుతూ తులసిరాజ్ గోకుల్ న్యాయవృత్తి అనుభవం, సలహాలు లెజిస్లేటివ్ పాలనా వ్యవహారాల్లో ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు.

ఆపరేషన్ కగార్ పేరుతో మానవ హననం సరికాదు

- కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ఏకపక్ష విధానాలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో మానవ హననానికి పాల్పడటం సరైంది కాదని పలువురు వక్తల అభిప్రాయపడ్డారు. ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో 'సంక్షోభ కాలం రాజ్యాంగ హక్కులు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక నాయకులు వంగాల సంతోష్, రైతు-కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెలుతురు సదానందంలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ నాయకులు అబ్బాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను తీవ్రంగా ఖండించారు. పిడికెడు మంది కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు నెరవేర్చడానికి ఈ దేశ ప్రజలపై పాలకులు ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షులు విమలక్క మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా అందరం ఐక్యమై పోరాడుదామని పిలుపునిచ్చారు. జస్టిస్ (రిటైర్డ్) చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజలను హింసించి చంపితే, ప్రజాస్వామ్యమవుతుందా? అని ప్రశ్నించారు. సనాతన ధర్మం పేరుతో విద్యాలయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తన సందేశాన్ని పంపగా వక్తలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపి మల్లు రవి, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరావు, కట్టా భగవంత్ రెడ్డి, ఎం సిపిఐ రాష్ట్ర నాయకులు మస్కుల మట్టయ్య, కాశం సత్యనారాయణ, ఆప్ నాయకులు సుధాకర్, ఎఐటియుసి నాయకులు బాల్‌రాజు, పరమేష్, టిపిడిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రకాష్, రైతు-కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందం, నాయకులు వెంకటేశ్వర్ రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు మల్సూర్, పోతుల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాకేష్, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్, రాష్ట్ర నాయకులు రాయమల్లు, వెంకట్ లక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులు డల్.. మిర్చి సాగులో కోత

- 3.63 లక్షల నుంచి 96 వేల ఎకరాలకు పడిపోయిన సాగు
- ఖమ్మం మార్కెట్లో రెండేండ్ల క్రితం క్వింటా రూ.25 వేలు ఇప్పుడు రూ.12 వేలు
- ఎకరానికి రూ.3.25 లక్షల పెట్టుబడి.. ప్రస్తుత ధరల్లో రూ.5 వేలు నష్టమే..!



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"వాణిజ్య పంటల రారాజు మిర్చి. అన్నీ అనుకూలిస్తే రైతులకు సిరుల పంటే.. ఎన్ని ప్రతికూలతలు ఉన్నా ధరలు బాగుంటే రైతులకు రూ.లక్షల్లో ఆదాయం తీసుకువచ్చేది ఇదే. అటువంటి ఈ పంట రెండేండ్లుగా నష్టాల బాట పడుతోంది. దీనికి తెగుళ్ల పెరగడం, దిగుబడులు తగ్గటం ఓ కారణమైతే.. ఎగుమతులు లేక ధరలు క్షీణించటం ప్రధాన కారణం."

రాష్ట్రంలో మిర్చి సాగు విస్తీర్ణం పడిపోతోంది. గత సీజన్‌లో విదేశాలకు ఎగుమతులు లేక మార్కెట్లో ధరలు విపరీతంగా తగ్గాయి. 2023లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా రూ.25వేలకు పైగా పలికిన మిర్చి ఇప్పుడు రూ.12వేలు-రూ.13వేలకే పరిమితమైంది. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం మిర్చి సాగు విస్తీర్ణం సగానికి పడిపోయిందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ నెలతో మిరప సాగు కాలం ముగుస్తుంది. దేశంలో 8.72 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. కేవలం మనరాష్ట్రంలోనే 3.63 లక్షల ఎకరాల్లో సాగయ్యే పంటను ఇప్పటి వరకు 96వేల ఎకరాల్లోనే రైతులు సేద్యం చేశారు.

కోల్డ్ స్టోరేజీల్లోనే పంట

మన దగ్గర పండించిన మిర్చిని చైనా, థాయ్‌లాండ్, అమెరికా వంటి దేశాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తారు. ఇప్పుడు ఆ దేశాల్లోనూ మిర్చి సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో దిగుమతి చేసుకోవటం తగ్గించారు. మనదేశంలోని ఉత్తరాది రాష్ట్రాలకు సైతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మిర్చి ఎక్కువగా ఎగుమతి అయ్యేది. ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లోనూ మిర్చి సాగవుతుండటంతో అక్కడికీ ఎగుమతులు నిలిచిపోయాయి. ఫలితంగా నిరుడు పండించిన పంట ఇప్పటికీ కోల్డ్‌స్టోరేజీలు, గోదాముల్లో నిల్వ ఉంది. మల్టీనేషనల్ కంపెనీలు గతంలో రైతులతో బై బ్యాక్ ఒప్పందాలు కుదుర్చుకొని మిర్చి సాగును ప్రోత్సహించేవి. ప్రస్తుతం మార్కెట్లో మిర్చికి డిమాండ్ లేకపోవటంతో కంపెనీలు కూడా ఆసక్తి చూపటం లేదు.

మిగులు లేకే వెనుకబాటు

గత ఏడాది నుంచి మిర్చి ధరలు క్షీణించటంతో మిగులు లేక రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎకరానికి దాదాపు రూ.3.20 లక్షలు పెట్టుబడి అవుతుండగా ప్రస్తుత ధరల ప్రకారం విక్రయిస్తే రూ.3.50 లక్షల వరకు వస్తున్నాయి. 9నెలల పాటు కష్టపడితే కేవలం రూ.30వేలు మాత్రమే మిగులుతున్నాయి. అది కూడా రూ.14వేలకు క్వింటా చొప్పున అమ్మితేనే ఈ కొద్దిపాటి లాభం కూడానూ. ఒకవేళ రూ.12వేలకు క్వింటా చొప్పున విక్రయిస్తే రూ.5వేల వరకు నష్టం చవిచూడాల్సిందే. గత మూడు, నాలుగేండ్లుగా మిర్చికి నల్లుల బెడద ఎక్కువైంది. తామరనల్లి వ్యాప్తి అధికంగా ఉండటంతో రైతాంగం వారానికి రెండు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. 9నెలల కాలంలో 45-50 సార్లు పురుగుమందు స్ప్రే చేస్తే దీనికే రూ.లక్షకు పైగా పెట్టుబడి అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తే.. మిర్చి కోతలకు క్వింటాకు రూ.6వేల చొప్పున వెచ్చించాల్సి ఉంటుంది. అంటే పురుగుమందులు, మిర్చి సేకరణకే రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఇక.. అడుగుమందులు, దున్నుడు కూళ్లు, పాట్లు, కలుపుతీత పనులకు కలిపి మరో రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. కనీసం క్వింటా రూ.20వేలకు పైగా ఉంటే రైతుకు ఎకరానికి రూ.2-3 లక్షల వరకు మిగులుతాయి. ప్రస్తుత ధరలతో ఏమాత్రం గిట్టుబాటు కాదనే కారణంతో రైతాంగం మిరప సాగుకు సిద్ధపడట్లేదని ఉద్యానశాఖ చెబుతోంది.

గతేడాదితో పోల్చితే దానిలో సగానికి తక్కువే..

2024-25 సీజన్‌లో రాష్ట్రంలో 2,66,043 ఎకరాల్లో మిర్చి సాగవగా దీనిలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 60,401 ఎకరాలు, మహబూబాబాద్‌లో 48,729, జోగులాంబ గద్వాలలో 38,363, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 22,555, జయశంకర్ భూపాలపల్లిలో 20,145, భద్రాద్రి కొత్తగూడెంలో 17,590 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 30వేలు, మహబూబాబాద్ జిల్లాలో 25వేలు, భద్రాద్రిలో 8వేల ఎకరాల్లో ఇప్పటి వరకు మిర్చి సాగైనట్టు ఉద్యానశాఖ అధికారుల అంచనా. రాష్ట్రం మొత్తమ్మీద 96వేల ఎకరాలు మాత్రమే సాగైనట్టు లెక్కలు చెబుతున్నాయి. మిరప విత్తనాల విక్రయాలు కూడా భారీగా తగ్గాయి.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లకు దేశవ్యాప్త ఉద్యమం

- వికలాంగుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్
- జిఒ 34 అమలు చేయాలి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య డిమాండ్



మాట్లాడుతున్న ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేస్తామని ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ తెలిపారు. ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సమావేశాల సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇసిఐఎల్ కమలానగర్‌లోని ఎన్‌వి భాస్కర్‌రావు భవన్‌లో శనివారం 'వికలాంగుల విద్యా - ఉపాధి, చట్టాల అమలు, అనుభవాలు' అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే ఎన్నిక గురించి మాట్లాడుతున్న మోడీ ఒకే పెన్షన్ కోసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వికలాంగులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. వికలాంగుల పట్ల వివక్షత, అసమానతలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 25 శాతం వికలాంగులకు అదనంగా ఇవ్వాలని చట్టంలో ఉన్నా అమలు చేయడం లేదన్నారు. సుగమ్య భరత అభియాన్ పథకం అమలులో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ నినాదానికే పరిమితం అవుతున్నదని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో స్పెషల్ టీచర్‌లను నియమించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2012 నుంచి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ నేషనల్ డిసెబుల్డ్ పెన్షన్ రూ.300 మాత్రమే ఇస్తోందని తెలిపారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్రం వాటా రూ.5000కు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా 2023లో ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 34ను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 23 నెలలవుతున్నా పెన్షన్ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వరమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు యశోద, కాషాప్ప, ఉపేందర్ అరిఫా, మధుబాబు సహాయ కార్యదర్శులు రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రమోహన్, ప్రకాష్, దుర్గ, కవిత, భాగ్యలక్ష్మి, బాలయ్య, నర్సిములు, ప్రభుస్వామి, లలిత, షాయిన్ బేగం, రమేష్, మల్లేష్, యాదయ్య, నగేష్, వెంకన్న, రాజు, లక్ష్మి పతి, బంగారయ్యతో పాటు వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన డిసిఒ

- రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



లంచం తీసుకుంటూ సహకార శాఖ అధికారి ఎసిబి అధికారులకు చిక్కారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నివాసముంటున్న జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు శనివారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. బెజ్జూర్ పిఎసిఎస్‌లో పనిచేస్తున్న మాజీ సిఇఒ వెంకటేశ్వర్‌గౌడ్‌ను రెన్యువల్ చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రెండు విడతలుగా ఇచ్చేందుకు రూ.8 లక్షల ఒప్పందం కుదుర్చుకున్నారు. మొదటి మాజీ సిఇఒ విడతగా రూ.2 లక్షలు ఇచ్చేందుకు రాథోడ్ బిక్కు ఇంటికి వెళ్లగా, ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నస్పూర్‌లో ఉన్న కలెక్టరేట్‌లోని కోఆపరేటివ్ కార్యాలయానికి తరలించి విచారించారు. విచారణ అనంతరం రాథోడ్ బిక్కుపై కేసు నమోదు చేసి కరీంనగర్‌లోని ఎసిబి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎసిబి అధికారులు తెలిపారు. బిక్కు గతంలో ఆసిఫాబాద్ జిల్లాలో పని చేసి తాజాగా మంచిర్యాల జిల్లా కోఆపరేటివ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు.

రేబిస్‌తో చిన్నారి మృతి

- బాల్కొండలో విషాదం

హైదరాబాద్ బ్యూరో : నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో రేబిస్ వ్యాధితో చిన్నారి మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన గడ్డం మహేష్ కూతురు లక్షణ (11) అక్టోబర్ 1న ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీధికుక్క దాడి చేసింది. దాంతో బాలికకు కుటుంబ సభ్యులు టీకాలు వేయించారు. కానీ తలపై చిన్న గాయమైంది. దానిని గమనించలేదు. ఈ క్రమంలో రెండ్రోజుల కిందట చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆర్మూర్ పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి రేబిస్ లక్షణాలున్నాయని తెలిపారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బాలికను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి లక్షణ శనివారం ఉదయం మృతి చెందింది. వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణలోనూ ఎస్ఐఆర్

- మీరూ... సిద్ధంగా ఉండండి
- తప్పుల్లేని, సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించాలి
- జిల్లా కలెక్టర్లకు సిఇఒ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా (ఎస్ఐఆర్) సవరణలో భాగంగా చేపట్టాల్సిన అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి (సిఇఒ) సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా సవరణపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేబుల్‌టాప్ వ్యాయామం వంటి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ వారీగా పురోగతిని సమీక్షిస్తూ, కచ్చితమైన లోపరహిత ఓటర్ల జాబితా తయారీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, తప్పులేని, సమగ్ర ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం ఎన్నికల కమిషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల జాతీయ సమావేశంలో ఎన్నికల జాబితా నిర్వహణలో సాంకేతికత వినియోగం, పారదర్శకత పెంపు, ఓటర్ల సేవల మెరుగుదల ఉత్తమ పద్ధతుల అమలు వంటి అంశాలపై చర్చించినట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను నిర్వహించనున్నట్టు నవంబర్ ఒకటిన నిర్వహించనున్న సమీక్షా సమావేశం వరకు అన్ని పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్లను సమీక్షా సమావేశంలో రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందుల తయారీ కేంద్రం గుట్టురట్టు

- 15 ఏళ్లుగా దందా.. రూ.కోట్లల్లో సంపాదన
- అధికారుల కనుసన్నల్లోనే వ్యవహారం!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నకిలీ పురుగుమందులు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గుట్టు చప్పుడు కాకుండా 15 ఏళ్లుగా నకిలీ పురుగుమందులు తయారు చేస్తున్న కేంద్రంపై శనివారం పోలీసు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ ఘటన జోగులంబ గద్వాల జిల్లాలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఐజ మండలం పులికల్ గ్రామానికి చెందిన వీరేష్ సూపర్ సింబోలా మైక్రోన్యూట్రింట్ కంపెనీ పేరుతో 15 ఏళ్లుగా నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్నాడు. వాటిని రైతులకు అంటగడుతూ కోట్లల్లో సంపాదిస్తున్నాడు. వివిధ స్థాయిల అధికారులకు మామూళ్ళు ముట్ట చెబుతూ ఈ తతంగం నడిపిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బడా రాజకీయ నాయకుని అండదండలు కూడా పుష్కలంగా ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం పోలీసు, వ్యవసాయ అధికారులు రంగంలోకి దిగి నకిలీ పురుగుమందుల తయారీ కేంద్రంపై దాడి చేశారు. వివిధ కంపెనీలకు చెందిన నకిలీ లేబుల్లు, ఖాళీ బాటిళ్లు, నకిలీ మందులు నింపిన బాటిళ్లను స్వాధీనం చేసుకొని వీరేష్‌ను అరెస్టు చేశారు. ఈ వ్యాపారంతో సుమారు రూ.50 కోట్లు ఆర్జించినట్టు అధికారుల అంచనా. దాడుల్లో ఐజ పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జనార్దన్‌రావు ఉన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ అమ్మకాలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో ఉన్న పురుగుమందుల షాపులకు ఈ నకిలీ మందులు సరఫరా చేసినట్టు అధికారులు గుర్తించారు. పెద్దపెద్ద గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని పురుగుమందులు విక్రయిస్తున్నట్టు తెలిసింది. పురుగుమందుల షాపులను నిర్వహిస్తున్న డీలర్లకు ఎక్కువ మొత్తంలో లాభాలు చెల్లిస్తూ రైతులకు నకిలీ మందులు అంటగడుతున్నారు.

కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండుగగా జరపాలి

- ఎండోమెంటు అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించాలని, రాష్ట్రంలోని ప్రతి దేవాలయం దీపాలతో అలకరించాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ ఏడాది కార్తీక దీపోత్సవం 22 నుంచి 19 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు శైలజ రామయ్యర్, హరీష్, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంటు కమిషనర్లు, ఇఒలతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల ఇఒలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవాన్ని సాయంత్రం 6 గంటల నుండి జరపాల్సి ఉంటుందని, ఈ కార్యక్రమంలో పాల్గొనే యాత్రికులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటు పసుపు కుంకుమ తాంబూలాలను మహిళా యాత్రికులకు అందచేస్తున్నట్టు వివరించారు. కార్తీక సోమవారం నాడు సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే యాత్రికులకు పైన పేర్కొన్న వస్తువులతో పాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, ఏదైనా పండు, కనుము ప్రధాన దేవాలయలలో యాత్రికులకు ఇస్తున్నట్టు తెలిపారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో యాత్రికులు దీపాలు వదలటానికి అవసరమైనచోట తాత్కాలిక వాటర్ పాండ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాల్లో నది హారతి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైతే ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారో... అక్కడ స్థానికంగా రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ విభాగాల సాయంతో చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మహిళలు, ఇతర యాత్రికులకు మంచి నీటి వసతి నిర్వహించాలన్నారు. శానిటేషన్ వర్కర్స్ సేవలు వినియోగించుకోని ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాల ఆధారంగా ముందుకు వెళ్ళాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు కూడా ఏదో ఒక రోజు పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని మంత్రి ఎండోమెంటు అధికారులను ఆదేశించారు.

నిరుద్యోగుల పదేళ్ల నిరీక్షణకు ముగింపు

- ఏడాదిన్నర కాలంలోనే 80 వేల కొలువులు
- రాజకీయ నిరుద్యోగులే బాకీ కార్డుల డ్రామాలు
- మంత్రి సీతక్క



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టిజిఐఆర్‌డి) ఆడిటోరియంలో డిపిఒ, ఎంపిడిఒ శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్ సృజన, టిజిఐఆర్‌డి సిఇఒ నిఖిల పాల్గొన్నారు. గ్రూప్ వన్ పరీక్ష ద్వారా ఎంపికై రెండు వారాలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న డిపిఒ, ఎంపిడిఒలకు మంత్రి సీతక్క ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇంతకాలం మీరు విద్యార్థులు. నేటి నుంచి ఉన్నతాధికారులు. రాష్ట్రంలో మొట్టమొదటి గ్రూప్ వన్ బ్యాచ్ మీది. అందుకే రాష్ట్ర చరిత్రలో మీకు ప్రత్యేక స్థానం ఉంది' అని అభినందించారు. 'పదేళ్ల నిరీక్షణకు ఇప్పుడు ఫలితం దొరికింది. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మీలాంటి ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. ఏడాదిన్నర కాలంలోనే 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగలిగాము. మాది ఉద్యోగ నామ ప్రభుత్వం' అని తెలిపారు. తమ పదవులు కోల్పోయి నిరుద్యోగులుగా మారిన కొందరు రాజకీయ నాయకులు ఇప్పుడు నిరుద్యోగ కార్డులు అంటూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులను నిండా ముంచిన బిఆర్ఎస్ నాయకులను నిరుద్యోగులు నిలదీయాలన్నారు. గ్రామీణ అభివృద్ధిలో ఎంపిడిఒల పాత్ర ఎంతో కీలకమని, మండల స్థాయిలో అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత ఎంపిడిఒలదేనని గుర్తు చేశారు. ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శిక్షణ పొందిన అభ్యర్థులు మంత్రి సీతక్కను ఘనంగా సత్కరించారు. ప్రజా ప్రభుత్వానికి వారధులుగా ఎంపిడిఒలు నిలవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ఆరోపణలు అవాస్తవం

- కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హ్యామ్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే రోడ్ల నిర్మాణంలో రూ. ఎనిమిది వేల కోట్ల స్కాం జరుగుతుందని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రోడ్లు వేయాలంటే మనసు రాలేదనీ, ఇప్పుడు అద్దం లాంటి రోడ్లు వేస్తామంటే బిఆర్‌ఎస్ నేతల గుండెలు అదురుతున్నాయనీ వ్యాఖ్యానించారు. పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్టు, అన్నిట్లో స్కాంలు చేసిన మీకు ఏది చూసినా స్కాంలాగే కన్పిస్తుందనీ విమర్శించారు. కాళేశ్వరం స్కాం, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్కాం, ధరణి స్కాం, గొర్రెల స్కాం ఇలా చెప్పుకుంటూ పోతే పదేండ్ల కాలంలో మీరు చేసిన స్కాంలకు అంతేలేదని వివరించారు. మాజీ ఆర్అండ్‌బి శాఖ మంత్రిగా పనిచేసిన ఆయనకు ఇది తెలియకపోవడం బాధాకరమన్నారు. సిఆర్ఐఎఫ్‌లో కిలోమీటర్‌కు రూ.1.75 కోట్లు అవుతుందన్నారు.

మూసాపేటలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.50 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రహీం

ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం

- మోడీ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం
- డివైఎఫ్ఐ అధ్యక్షులు ఎంపి రహీం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో విఫలమైందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) అఖిల భారత అధ్యక్షులు, ఎంపి ఎఎ రహీం విమర్శించారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేస్తోందని అన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఉన్న ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మివేస్తూ బడా పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ విభజించు పాలించు విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనంతగా మోడీ ప్రభుత్వంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతోందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. అందులో భాగంగానే ఎనిమిది గంటల నుంచి 12 గంటల పని విధానాన్ని పెంచి కార్మికుల శ్రమను దోపిడీ చేసి కార్పొరేట్లకు మేలు చేస్తోందని చెప్పారు. పని ఒత్తిడితో అనేక తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వరంగాన్ని ప్రయివేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను తీసివేస్తోందని విమర్శించారు. నిరుద్యోగ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కృష్ణ నాయక్, శివవర్మ, జావీద్, మల్లం మహేష్, ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్, ఆనంద్, ప్రశాంత్ చారి, పల్లె మధు, అరవింద్, ప్రశాంత్, నరేందర్, మధు, నవీన్, హస్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రిజర్వేషన్ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి

- రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
- పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన బిల్లును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటోందని, రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం ఒత్తిడి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్‌తో కలిసి జాన్‌వెస్లీ శనివారం ఆసిఫాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆగారు. వారికి పార్టీ జిల్లా నాయకత్వం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కుల గణన చేసి, అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, ఆర్డినెన్స్, జిఓ తీసుకొచ్చినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకొని సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రం నుంచి బిజెపి తరపున గెలిచిన 8 మంది ఎంపిలు, 8 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు కేంద్రంపై ఒత్తిడి చేసి అమలు చేయించాలని, లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకొని ఐక్యఉద్యమాన్ని నిర్మించి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని, దానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల వాగ్దానం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి దాన్ని కూడా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయో ప్రకటించి, వాటి భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదలు ఇండ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు చేసి గుడిసెలు వేసుకొని ఉన్నారని, వాళ్లందరికీ పట్టాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, ఆ హామీలు అమలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వారి వెంట సిపిఐ (ఎం) పెద్దపల్లి కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు టి.రాజారెడ్డి, ఎస్.బిక్షపతి, సిహెచ్.శైలజ, గీట్ల లక్ష్మారెడ్డి ఉన్నారు.

అప్పులతో రైతుల ఆత్మహత్యలు.. కార్పొరేట్‌లకు రాయితీలు

- కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు
- కపాస్ కిసాన్ యాప్ అమలుతో సిసిఐని నీరుగార్చే యత్నం
- పత్తి రైతుల రాష్ట్ర సదస్సులో ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'దేశానికి అన్నం పెట్టే రైతులు అప్పులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.. కానీ అందుకు కారకులైన కార్పొరేట్ సంస్థలకు కేంద్రం రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటు' అని ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. జనగామలోని కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో శనివారం తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి అధ్యక్షతన 'పత్తి రైతుల' రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులతో మోసపోయి దిగుబడి సరిగా రాక.. పెట్టిన పెట్టుబడులు ఎల్లక.. రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు.

దిక్కుతోచని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం వదిలేసి రైతులు ఇతర రంగాలకు ఉపాధి కోసం పోతున్నారని, దీనికి కారణం బిజెపి ప్రభుత్వ విధానాలేనని అన్నారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం.. గిట్టుబాటు ధరలు పత్తి క్వింటాల్‌కు రూ.10,075 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దేశంలో పత్తి పంట మార్కెట్లోకి వచ్చే సమయంలోనే 11శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేసి విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి ధరలు పడిపోయి రైతులు పెట్టిన పెట్టుబడులు రాక ఆత్మహత్య చేసుకునే దుస్థితి వస్తుందని అన్నారు. కేంద్రం దొడ్డిదారిన మార్కెట్ల ముసాయిదా చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రైస్ డెఫిసిటీ పేమెంట్ స్కీమ్, కపాస్ కిసాన్ యాప్‌ని తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకునేలా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ పత్తి రైతు సంఘం రాష్ట్ర కోకన్వీనర్ మూడ్ శోభన్ మాట్లాడుతూ.. సిసిఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే అన్ని జిల్లాల్లో రైతులకు అనుకూలమైన ప్రదేశాల్లో అవసరమైనవన్ని ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తిలో తేమశాతం 8 నుంచి 12 శాతం ఉన్న దాన్ని 10 నుంచి 15శాతానికి మార్చాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్ర కో కన్వీనర్ భూక్యా చందునాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య, నాయకులు మంగ బీరయ్య, చిలుకూరి రాము, వాంకుడోత్ కోబల్, ఎం.కనకాచారి, జి.రామన్న, చిలుక బాల్‌రెడ్డి, ఎర్రనాయక్, షేక్ సైదా, సుధాకర్, చల్ల నరసింహారెడ్డి, చింతల రజనీకాంత్, కొప్పుల రజిత, ప్రసాద్, వెంకట్ మావో, జనగామ జిల్లా జిల్లా నాయకులు రమావత్ మీటియా నాయక్, మాచర్ల సారయ్య, పయ్యావుల బిక్షపతి, నక్క యాకయ్య, కుమారస్వామి, బోడ రాములు, బెల్లంకొండ వెంకటేష్, జాటోత్ శ్రీను నాయక్, ఎల్లేష్, ఉపేందర్, రవీందర్ రెడ్డి, రాజవ్వ, బచ్చు, శ్రీలత, గురజాల లక్ష్మీనరసింహారెడ్డి, వివిధ జిల్లాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి కేంద్రానికి ధాన్యం తెచ్చి నెల రోజులవుతున్నా కొనుగోలు చేయలేదని, వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు శనివారం నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తాము మార్కెట్‌కు ధాన్యం తెచ్చి నెల అవుతోందన్నారు. తేమ శాతం వచ్చినా కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసి మొలకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు దేవిరెడ్డి అశోకరెడ్డి, శ్రీకర్, మహిళా రైతులు పాదూరి గోవర్ధన, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, ముత్తారెడ్డి, మండల దుర్గయ్య, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ జైత్రయాత్ర

- కాంగ్రెస్ మోసాలను ప్రజలు తిప్పికొడతారు - కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ జైత్ర యాత్ర ప్రారంభమవుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కాలేదని, పేదల ఆశలు అడియాశలయ్యాయని మండిపడ్డారు. మహిళలకు రూ.2,500 పెన్షన్, వృద్ధాప్య పింఛన్ రూ.4,000 పెంపు, కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు తులం బంగారం.. ఇలా 420 వాగ్దానాల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను దేశంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు వెల్లడించారు. '20 వేల లీటర్ల ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5కే భోజనం, పింఛన్లతో పాటు అనేక పథకాలు అమలు చేశాం. ప్రాపర్టీ ట్యాక్స్‌ను తీసేశాం. షేక్‌పేటలో పెద్ద ఫ్లైఓవర్‌ను నిర్మించాం. జిహెచ్ఎంసితో పాటు ప్రతి ఎన్నికలో హైదరాబాద్ ప్రజలు బిఆర్ఎస్‌కు ఓటేశారు' అని ఆయన వివరించారు. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులతో పాటు సబ్బండ వర్ణాలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారని కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. షేక్‌పేట్ డివిజన్ బిజెపి మాజీ అధ్యక్షులు తోట మహేష్‌తో పాటు పలువురు నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కెటిఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంటర్ ప్రాక్టికల్ కేంద్రాల తొలగింపు అన్యాయం

- యథావిధిగా కొనసాగించాలి : టిఎంఎస్‌టిఎ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ప్రాక్టికల్ కేంద్రాలను కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలైన మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాలను తొలగించడం అన్యాయమని టిఎంఎస్‌టిఎ విమర్శించింది. ప్రాక్టికల్ కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టిఎంఎస్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కొంతం నగేశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో ల్యాబ్ పరికరాలు, సిసి కెమెరాలు, సరైన మౌలిక సదుపాయాలు అన్ని అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయినా వాటి పట్ల ఇంటర్ బోర్డు చూపుతున్న వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారని తెలిపారు. ఇతర కాలేజీలకు వెళ్లి ప్రాక్టికల్ పరీక్షలను రాయాలంటే భయభ్రాంతులకు గురవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలనుకుంటే ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే మోడల్ స్కూళ్లు, గురుకులాలకు ప్రాక్టికల్ కేంద్రాలను కేటాయించాలని డిమాండ్ చేశారు.

సిపిఎస్ రద్దు కోసం నవంబర్ 25న చలో ఢిల్లీ

- ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిఎస్ వద్దనీ, సిపిఎస్‌ను రద్దు చేయాలనీ, ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసూ నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) ఆధ్వర్యంలో వచ్చేనెల 25న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లో టిఎస్‌సిపిఎస్‌ఈయు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... వచ్చేనెల 25న ఢిల్లీలో భారీ బహిరంగ సభను జరుపుతామని చెప్పారు. యుపిఎస్ అనేది ఒక విఫల పథకమనీ, అందులో చేరడానికి తేదీని మూడు సార్లు కేంద్రం పొడిగించిందని అన్నారు. మూడు సార్లు సవరించినా కేవలం మూడు నుంచి నాలుగు శాతం ఉద్యోగులు మాత్రమే దాన్ని ఎంచుకున్నారని వివరించారు. అందుకే యుపిఎస్ వద్దనీ, సిపిఎస్‌ను రద్దు చేయాలనీ, ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, ఉపాధ్యాయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రైల్వే, ఇతర శాఖల ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

80 మార్కులకే ఇంటర్ పరీక్షలు

- ఇంటర్నల్స్‌కు 20 మార్కులు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు
- వచ్చే విద్యాసంవత్సరంలో ఎసిఇ కొత్త గ్రూపు
- ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. థియరీ పరీక్షలు 80 మార్కులకే జరగనున్నాయి. ఇంటర్నల్స్‌కు 20 మార్కులుంటాయి. ఈ నిర్ణయం వచ్చే విద్యాసంవత్సరం (2026-27) నుంచి అమల్లోకి రానుంది. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎస్.కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమవుతాయని, మార్చి 18 వరకు జరుగుతాయని వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. ఇంటర్‌లో కొత్తగా అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ (ఎసిఇ) గ్రూపును ప్రవేశపెట్టబోతున్నామని వివరించారు. ఈ నిర్ణయాలు కూడా వచ్చే విద్యాసంవత్సరం (2026-27) నుంచి అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇంటర్ థియరీ పరీక్షలను 80 మార్కులకే నిర్వహిస్తామని అన్నారు. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్స్ నిర్వహిస్తామన్నారు. సబ్జెక్టులతోపాటు లాంగ్వేజెస్ కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇప్పటి వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలుంటాయని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేసిన 30 మార్కులను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 15 మార్కులకు, ద్వితీయ సంవత్సరంలో 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ వంటి సబ్జెక్టులకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఇంగ్లీష్ మాత్రమే అంతర్గత పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంస్కృతం, తెలుగు ఇతర ఆర్ట్స్, కామర్స్ అన్ని సబ్జెక్టులకూ ఇంటర్నల్ మార్కులు ఉంటాయని అన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంఈసీ గ్రూప్ విద్యార్థులకు ప్రత్యేకంగా గణితం ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలని నిర్ణయించామని చెప్పారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మేలు కలిగేలా 12 ఏండ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌ను మారుస్తున్నామని అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి మార్గదర్శకాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులుంటాయని చెప్పారు. సిలబస్ మార్పులకు సంబంధించిన సబ్జెక్టు నిపుణులతో వచ్చేనెల ఒకటి నుంచి డిసెంబర్ 15 వరకు 45 రోజులపాటు కసరత్తు చేస్తామని వివరించారు. వారి అభిప్రాయాలకు అనుగుణంగా నివేదికను రూపొందించనున్నట్టు చెప్పారు. కొత్త సిలబస్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాల ముద్రణను ఏప్రిల్ నెలాఖరు నాటికి లేదా మే మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజే అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సిలబస్‌ను రూపొందించడంతోపాటు పాఠ్యపుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తామని వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో డిజిటలైజ్ చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానం అమలుపై పరిశీలిస్తామన్నారు. టీస్టెమ్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రయివేటు పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ, పీజీ, యూనివర్సిటీల్లోని ల్యాబ్‌లను వాడుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 14 మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న ప్రయివేటు జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదనీ, అందులో మూడు వేల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సిఒఇ) జయప్రద బాయి, జాయింట్ సెక్రటరీలు భీం సింగ్, జ్యోత్స్న రాణి, వసుంధర, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్, పెసర కొనుగోళ్లకు అనుమతి ఇవ్వండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోయాబీన్, పెసర పంట కోతకు వస్తున్న సమయంలో కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పంటలకు మద్దతు ధరలు, సేకరణపై మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. సోయా, పెసర పంటలను ప్రైస్ సపోర్టు స్కీమ్ (పిఎస్ఎస్) కొనేందుకు కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. రైతులు పత్తిని సిసిఐ కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, తొందరపడి దళారులకు అమ్మి మోసపోవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. పత్తిలో తేమ శాతం తగ్గించి సరైన గిట్టుబాటు ధర (ఎంఎస్‌పి) పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించే పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో సరిపడిన యంత్రాలు, పరికరాలు, సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో పత్తి సేకరణలో సిసిఐ నిబంధనల్లో 8-12 శాతం తేమ శాతం సడలించాల్సిందిగా అధికారులను కోరారు. ఈ నామ్ సర్వర్‌లో ఏర్పడుతున్న సమస్యల కారణంగా కొన్ని జిల్లాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ ఏడాది సిసిఐ ప్రవేశపెట్టిన మ్యాపింగ్ విధానం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఎల్1, ఎల్2 విధానంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నోడల్ అధికారులు నిరంతరం పంటల కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటికీ ప్రైస్ సపోర్టు స్కీమ్‌లో లేని మొక్కజొన్న పంటను కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.2400 కోట్లతో కొనుగోలు చేస్తున్నదని తెలిపారు.

ఇతర రాష్ట్రాల్లో మద్దతు ధర అమలు చేయకపోవడంతో సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు తమ పంటను తెలంగాణ మార్కెట్లలో అమ్మడం వల్ల స్థానిక రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీభాయి తదితరులు పాల్గొన్నారు.

మతాంతర వివాహితుల రక్షణ చట్టం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్
- గెర్రె గ్రామంలో హత్యకు గురైన రాణి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 140కి పైగా కుల, మతాంతర దురహంకార హత్యలు జరిగాయి.. వీటిపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.. వెంటనే కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తేవాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఈ నెల 18న హత్యకు గురైన గర్భిణి రాణి కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. మృతురాలి తల్లిదండ్రులు, సోదరులతో మాట్లాడారు. 'తమది తక్కువ కులం కావడంతోనే నా కూతురును పొట్టన పెట్టుకున్నారు' అని తల్లి అనూష రోదిస్తూ తెలిపింది. హత్య జరిగిన ప్రదేశాన్ని జాన్‌వెస్లీ పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటికీ కుల, మతాంతర దురహంకార హత్యలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. బిసి సామాజిక తరగతికి చెందిన శేఖర్, ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన రాణిని ప్రేమించి వివాహం చేసుకోవడం ఇష్టం లేని శేఖర్ తండ్రి సత్తయ్య గర్భిణి అని కూడా చూడకుండా కోడలిని గొడ్డలితో అమానుషంగా నరికి హత్య చేయడం దారుణమన్నారు. వారం రోజులు గడిచినా ఇప్పటి వరకు ఇక్కడికి జిల్లా కలెక్టర్, ఎస్‌పి రాకపోవడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. బాధిత కుటుంబం పేద గిరిజన కుటుంబం కావడమే అందుకు కారణమా అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము ప్రతిఘటిస్తామని, తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గ్రామాల్లో మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు పెట్టాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాణి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా ఈ కేసు విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ హత్యలో రాణి భర్త శేఖర్‌పైనా కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున అతన్ని వెంటనే అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టాలని కోరారు. రాణి హత్యకు నిరసనగా ఈ నెల 27న కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తున్నట్టు తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని ప్రజా సంఘాలు ఈ ముట్టడి విజయవంతానికి కృషి చేయాలని కోరారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలి

కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత నదిపై చేపట్ట తలపెట్టిన ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.